క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ముదిగొండ: మండలపరిధిలోని మేడేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటల సాగు వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను అడిగారు. కార్యక్రమంలో సర్పంచ్ సామినేని రమేష్, ఏఈఓ రాధ, ఎంపీఓ సూర్యనారాయణ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక


రజియా సుల్తానాను సన్మానిస్తున్న అధ్యాపకులు

సత్తుపల్లి: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్ ఎస్కే రజియా సుల్తానా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రజియా సుల్తానాతో పాటు రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికైన అర్థశాస్త్ర అధ్యాపకులు పి.సత్యనారాయణలను ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, కృష్ణారావు, చెన్నారావులు సత్కరించి అభినందనలు తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం

వైరా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష ఎంపీల హక్కులను కాలరాస్తూ.. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌పై దాడి ఘటనపై చర్చ జరపాలని పట్టు బట్టిన ఎంపీలను సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. 144 మంది ఎంపీలను పార్లమెంట్ నుంచి బయటకు పంపించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 22న చేపట్టే దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో బీజేపీ గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు పని చేయాలన్నారు.

ప్రజా పోరాటాలే కమ్యూనిస్టుల కర్తవ్యం


బిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రం

కారేపల్లి: సమాజంలో దోపిడీకి గురవుతున్న ప్రజలను చైతన్యం చేస్తూ, ప్రజా పోరాటాలు చేయటమే కమ్యూనిస్టుల కర్తవ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. బుధవారం మండలంలోని వడ్డెరగుంపు గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీపీఎం నాయకులు తమ్మిశెట్టి బిక్షం కుటుంబాన్ని సీపీఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక భాగమని, ప్రజా సమస్యలను చట్టసభల్లో వినిపించేందుకు, ప్రజలను జాగృతం చేసేందుకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె.నరేంద్ర, నాయకులు మాలోత్ రాంకోటి, రమేష్, మల్లమ్మ, వెంకన్న, కృష్ణకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భారతమ్మ మృతికి నివాళి


భారతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రసాద్

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామానికి చెందిన సీపీఐ నాయకురాలు అనుబోతు భారతమ్మ (65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండపర్తి గోవిందరావు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కూచిపూడి రవి, గ్రామసర్పంచ్ నక్కన బోయిన సుజాత, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

మరో అవకాశం


ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓటు నమోదుపై అవగాహన

- 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా..
- జనవరి 22 వరకు అవకాశం..
- ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రచురణ
- ప్రస్తుత ఓటర్లు 2,43,118 మంది

మండలాల వారీగా ఓటర్లు

మండలం	ప్రస్తుత ఓటర్లు
సత్తుపల్లి	64,259
వేంసూరు	36,463
పెనుబల్లి	43,174
కల్లూరు	53,475
తల్లాడ	45,747
మొత్తం	2,43,118

సత్తుపల్లిటౌన్: పార్లమెంట్ ఎన్నికలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు వేసేందుకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. ఈ నెల 20వ తేదీ నుంచి ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 2024 జనవరి 6వ తేదీన ముసాయిదా ప్రచురణ, 22వ తేదీ వరకు కొత్త దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరణ, ఫిబ్రవరి 2న పరిశీలన, ప్రక్రియను పూర్తి చేసి 8వ తేదీన ఓటర్ల తుదిజాబితా ప్రచురించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది.

ఓటు నమోదు చేసుకోండి..


రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు జనవరి 22వ తేదీలోగా ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి. వయోజనులందరూ తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండాలి. ఓటర్ల నమోదుపై ప్రత్యేక కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తాం.

– అశోక్ చక్రవర్తి, ఆర్డీఓ, కల్లూరు

పెరగనున్న ఓటర్లు..

తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు పలు విడతలుగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ క్రమంలో ఓటర్ల జాబితా పెరిగింది. మళ్లీ మరో దఫా అవకాశం కల్పించటం వల్ల సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాలలో ఓటర్ల జాబితా భారీగా పెరగనుంది, జాబితాలో పేర్లు లేని వారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

శిక్షణలు, సమావేశాలు..

బూత్ లెవల్ అధికారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, అభ్యంతరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఓటరు దరఖాస్తుల ఆధారంగా బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన తర్వాతనే పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాల్సి ఉంటుందని అధికారులు నిర్దేశించారు. ఇక కొత్త ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, రాజకీయ పక్షాల సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు: కల్లూరు శాంతినగర్‌లోని ఇమ్మాన్యేలు బాప్టిస్ట్ చర్చ్ నందు బుధవారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఆర్డీఓ అశోక్ చక్రవర్తిలు వేరు వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ జీవన్‌కుమార్, ఏఐసీసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.ఎనోష్‌కుమార్, కిష్టఫర్, ఫాదర్ ఫిలిప్, నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, పాలెపు రామారావు, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, ఖమ్మంపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ తాత సందడి..


గ్రామంలో సందడి చేస్తున్న క్రిస్మస్ తాత

కల్లూరురూరల్: మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ తాత సందడి నెలకొంది. మండలంలోని చిన్న కోరుకొండి, వెంకటాపురం తదితర గ్రామాల్లో క్రిస్మస్ పండగ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మతగురువులు, జోజిబాబు, కన్యాస్త్రీలు, ఉపదేశకులు, సంఘస్తులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన


ప్రొఫెసర్ ఐవీఎస్ రెడ్డిని సన్మానిస్తున్న రైతులు

తల్లాడ: మండలంలోని అంజనాపురం గ్రామంలో బుధవారం మామిడి రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఐవీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. మామిడి రైతులు పలు సూచనలు చేశారు. మామిడిలో వచ్చు తేనె మంచు పురుగు, పూత నిలుపుదల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మామిడిలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఐవీఎస్ రెడ్డిని రైతులు శాలువాలతో సన్మానించారు. తల్లాడ పరిసర గ్రామాల నుంచి సుమారు 200 మంది రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమిటోమ్ కంపెనీ మేనేజర్ సురేందర్, రాఘవ, ప్రశాంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి


హైలెవల్ వంతెనపై ఏర్పడిన గుంతలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వైరా/వైరారూరల్: ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న మండలంలోని స్టేజీపినపాక హైలెవల్ వంతెనపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో హైలెవల్ వంతెనపై ఏర్పడిన గుంతను పరిశీలించి మాట్లాడుతూ.. వంతెనకు ఇరువైపులా జాయింట్ల మీద ఏర్పడిన గుంతల కారణంగా నిత్యం ప్రమాదాలు జరిగి గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏళ్ల తరబడి సమస్య పునరావృతం అవుతున్నా అధికారులు మాత్రం శాశ్వత పరిష్కారం చూపకుండా నామమాత్రపు మరమ్మతులతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గుంతలకు శాశ్వత మరమ్మతులు చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. అదే విధంగా బ్రిడ్జి పక్కనే వైరా మున్సిపాలిటీకి చెందిన చెత్త చెదారం పడవేసి నిప్పు పెడుతుండటంతో పొగతో కాలుష్యం ఏర్పడి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, గోపాలరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

31న కళాకారుల వన సమారాధన


మాట్లాడుతున్న పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్

మధిర: మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపకుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ నెల 31న కళాకారుల వన సమారాధన నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్ తెలిపారు. వైరా రోడ్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్కూరు సమీపంలోని అబ్బూరి రామకృష్ణ మామిడి తోటలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో ఉన్న కళాకారులకు వన సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో 10 సంవత్సరాల క్రితం కళాపరిషత్‌ను ఏర్పాటు చేసి అంతరించిపోతున్న కళలను పరిరక్షించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కళలతోనే ప్రజల్లో అన్ని విషయాలపై చైతన్యం కలుగుతుందన్నారు. దాతల సహకారంతో ఆయన పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వన సమారాధన కార్యక్రమాన్ని పురస్కరించుకొని పలు కళా ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెండు జిల్లాల స్థాయి పరిధిలోని కళాకారులు పాల్గొనాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో గడ్డం శ్రీనివాసరావు, కళ్యాణపు పుల్లారావు, టీవీ రెడ్డి, కురిచేటి సత్యనారాయణ, బాబ్లా, మేడా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఓబీలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాల్సిన రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి సీవై పుల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.శరత్ బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఎఫ్, బోనస్‌లను కూడా జమ చేయకపోవటం వల్ల కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ–2 విస్తరణ పనులలో భాగంగా మట్టి వెలికి తీసే పనులను ఓ ప్రైవేట్ కంపెనీ 2021లో చేపట్టిందని, అప్పటి నుంచి సదరు కాంట్రాక్టర్ నెల నెల సరిగ్గా వేతనాలు ఇవ్వకుండా కార్మికులను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. జార్ఖండ్, బీహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి మిషన్ ఆపరేటర్లు, వోల్వో డ్రైవర్లు, మెకానిక్స్, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, ఇన్‌చార్జ్‌లుగా పని చేస్తున్నారన్నారు. వేతనాలు చెల్లించకపోతే పీఎస్‌సీడబ్ల్యూయు ఆధ్వర్యంలో సమ్మెకు దిగుతామని తెలిపారు.

మొక్కు తీర్చుకున్న అభిమాని

సత్తుపల్లి: సత్తుపల్లి ఎమ్మెల్యేగా డాక్టర్ మట్టా రాగమయి విజయం సాధించిన సందర్భంగా పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త గట్టే ప్రభు బుధవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు.

సేవాసదనంలో అన్నదానం


స్వీట్లు పంపిణీ చేస్తున్న స్వర్ణలత

మధిర: మధిర పట్టణంలోని మానసిక వికలాంగుల సేవా సదనంలో బుధవారం దివ్యాంగులకు అన్నదానం చేశారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న కోట నాగేశ్వరరావు, తేరోజమ్మ ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ముదిగొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావులు కోరారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో సీపీఎం మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, బండి పద్మ, వైస్ఎంపీపీ మంకెన దామోదర్, మండల నాయకులు ఇరుకు నాగేశ్వరరావు, ఉపేందర్, భద్రయ్య, రవి, భాస్కర్‌రావు, ప్రభావతి, కల్యాణ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్ కేసు నమోదు

కల్లూరు: మండల పరిధిలోని వచ్యానాయక్ తండా గ్రామానికి చెందిన బానోత్ రామకృష్ణ భార్యపై అదే గ్రామానికి చెందిన బానోత్ భరత్ అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపులలో చెడుగా పెట్టాడు. దీంతో రామకృష్ణ బుధవారం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు భరత్‌పై ఈవ్‌టీజింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్

తల్లాడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు. తల్లాడ రైతు వేదికలో బుధవారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని.. అలాగే మరణించిన వారి పేర్లను తొలగించాలన్నారు. ఓటరుకు సంబంధించి తప్పులను సవరించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ కె.శ్రీదేవి, ఆర్ఐలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన..

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం నూతన ఓటరు నమోదు కార్యక్రమంపై మాస్టర్ ట్రైనర్ ఎండీ జమీర్, తహసీల్దార్ ఉషాశారద అవగాహన కల్పించారు. జనవరి 1, 2024 తేది నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ నూతనంగా ఓటు నమోదు చేసుకునేందుకు అర్హులని వివరించారు. ఓటరు నమోదుల విషయంలో బీఎల్‌వోలు విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, అన్ని గ్రామాల బూత్ లెవల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఉషాశారద

నష్టపరిహారంలో రైతులకు ఊరట

మధిర: నాగపూర్ నుంచి అమరావతికి వెళ్లే జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భూముల కోల్పోయిన రైతులకు నష్టపరిహారం విషయంలో ఊరట లభించింది. మధిర మండలంలోని ఆత్కూరు గ్రామ రైతులకు రహదారి విస్తరణలో భూమి కోల్పోగా నష్టపరిహారం విషయంలో మొదట ఎకరానికి రూ.11 లక్షల మాత్రమే ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందారు. చుట్టుపక్కల గ్రామాల్లో చెల్లిస్తున్నట్లుగా ఎకరానికి రూ.21 లక్షలు ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ద్వారా కేంద్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆయన కార్యాలయం.. సంబంధిత మంత్రి నితిన్ గడ్కారీ కి, ఇతర ఉన్నతాధికారులకు సమస్యను వివరించారు. ఎకరానికి రూ.21 లక్షలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి, బీ.ఊపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయ రాజుకు, ఆత్కూరు గ్రామ సర్పంచ్ అబ్బూరి సంధ్యారాణి, వెలగపూడి నాగమల్లేశ్వరరావు, కొండల రావు, మీనుగు శంకరరావు, డాలు చిన్నకృష్ణ, మీనుగు కృష్ణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

అటవీ అధికారుల దాడులు ఆపాలి


మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిటౌన్: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి అటవీశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని.. దీనిని వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో బుధవారం తుమ్మలనగర్ గిరిజనులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్లుగా తుమ్మలనగర్ గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను అటవీ అధికారులు ఆక్రమించి దాడులు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ చర్యలను ఆపక పోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాటి వీరభద్రం, కుమారి, రాజమ్మ, రాజులు, లక్ష్మి, నరేష్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాచర్ల భారతి

సత్తుపల్లిరూరల్: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచర్ల భారతి కోరారు. సత్తుపల్లి మండలంలోని తాళ్లమడలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దాలను అమలు చేయాలన్నారు. ఆరు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేయలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బాల బుచ్చయ్య, జాజిరి శ్రీనివాస్, కుమారస్వామి, సనందన్‌రావు, శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసిన మిత్రుడు సుధీర్‌రెడ్డి


ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మిత్రుడు సుధీర్‌రెడ్డి

కల్లూరు: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంతరెడ్డిని బాల్య మిత్రుడు కల్లూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన అంకిరెడ్డి సుధీర్ రెడ్డి బుధవారం కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలలో 1989–92 విద్యాసంవత్సరంలో డిగ్రీ కలిసి చదువుకున్నట్లు సుధీర్‌రెడ్డి తెలిపారు. సీఎంను కలిసిన తర్వాత ఇరువురు ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సీఎంను కలిసిన వారిలో కల్లూరుకు చెందిన న్యాయవాది రామ్‌నరసింహారావు, సుధీర్ మిత్రులు కరుణాకర్‌రెడ్డి, రవీంధర్‌రెడ్డిలు ఉన్నారు.

మూడు చక్రాల సైకిల్ పంపిణీ


మనోజ్‌కుమార్‌కు మూడు చక్రాల సైకిల్‌ను అందిస్తున్న భవిత కేంద్రం నిర్వాహకులు

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలోని భవిత కేంద్రంలో తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్, అలింకో వారి సహకారంతో బస్వాపురం గ్రామానికి చెందిన దివ్యాంగ బాలుడు పాలకుర్తి మనోజ్‌కుమార్‌కు మూడు చక్రాల సైకిల్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లచ్చగూడెం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు షేక్ మహ్మద్ హుస్సేన్, సురేష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, రాంబాబు, ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత, ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, భవిత కేంద్రం సంరక్షకురాలు అరికొట్ల లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్యూరిఫైర్ వితరణ


దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మధిర: నిధానపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వేమూరి సునీల్ కుమార్, కుమార్తె హిమబిందు, అల్లుడు చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో బుధవారం వాటర్ ప్యూరిఫైర్ వితరణగా అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు లంకెల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిధానపురం పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తూ అకాల మరణం చెందిన నాగరాణి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు పాఠశాలకు ప్యూరిఫైర్ అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను సన్మానించారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధికి నాగరాణి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాదా కృష్ణారెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, సత్యావతి, ఆర్ రంగారావు, ఎం.కృష్ణయ్య, రమాదేవి పాల్గొన్నారు.